శతకత్రయం

(దుర్గాశతి ❖ మల్లేశ్వర శతకం ❖ హనుమ త్రింశతి)

రచయిత :

దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి

కాకినాడ



రచయిత :

దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి

కాకినాడ

దుర్గాశతి

దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి గారిచే
రచింపబడిన

దుర్గాశతి

ఓం

జనని ఓంకార దివ్య పంజరపు జిలుక !
ఉపనిషత్కేలివనముల నుండు పికమ !
ఆగమపుటడవులకేరునట్టి నెమ్మి !
గౌరి! నిను లోక మాతగా గణన సేతు. 1

దయను చిలికెడి సోఁగ కన్దంట దాన !
అభ్యుదయ మార్గమందిచ్చు నభయ వరద !
వామకుచమాను వీణెతో వరలు దాన !
సరస సంగీత మాతృకా! జయము జనని ! 2

పంచ ముఖముల తోడ దీపించు తల్లి!
ఉంగరపు ముంగురుల ముద్దులొలుకు తల్లి !
కుటిల చిత్తుల శిక్షింప గోరు తల్లి!
పద్మవాసిని! శ్యామలా ! వందనములు 3

కులుకు రాయంచనడల రాజిలెడి తల్లి !
చంద్ర శేఖరు రాణిగా జరుగు తల్లి !
తీయ తీయని పలుకులఁ దివురు తల్లి !
కలమతంగ సత్కుల కన్యకామతల్లి ! 4

మొగ్గపల్ చాలు సొగసు మోమునకు గూర్ప
కుంకుమపుబూత నొసలున గుబురుకొనగ
నీలమణి కాంతి యొడలు వన్నెలు తొలంక
సర్వ లోకైక రాజ్ఞి! నిన్ సన్నుతింతు 5

తల్లి ! మాతంగి ! సిద్ధమాతంగి వీవు
మణి శకలమేచకాంగివి మాత నీవు
యౌవనవిహార విపిన సారంగివీవు
గాన పద్మానుభూతి భృంగమవు నీవు. 6

యోగి మనసులలో నిత్యముండుదాన !
వేదభాషితముల లోన వెలయు దాన !
గీతవిద్యా వినోదాల కేరుదాన !
అష్ట భైరవ వేష్టితా ! అంబ! నతులు. 7

రిక్కలను ధిక్కని తిరస్కరించునట్టి
నవ్య వజ్ర నాసాభరణమ్ము దాన !
గాన తాళగతుల జూపగఁల్గునట్టి
కనక మణి కంకణములతో గ్రాలుదాన ! 8

కచ్ఛపీనాద సంగమై, కమలవదన
మాధురీ భృంగమై, ఘృణామహిత రంగ
మై, సమస్తభక్తాకర్షి, యైనయట్టి
అమల భవదపాంగమ్ము నే నర్థిదలతు. 9

అంబ ! అజ్ఞాన, కర్మ, గాడాంధకార
దిగ్గజనులకు జ్ఞానైకదీపమీవు
అమృతవార్ధి మణిద్వీపమందుగల్గు
దివ్య కాదంబ వనసుస్థ దేవి వీవు. 10

శ్యామలాంగమ్ము సౌకుమార్యమ్ము చిమ్మ,
నిశ్చలానంద మొలుకునున్మేష మొప్పు
ఆర్ద్రతతొలంకు కల్లోలమైన చూపు
నీదు తరుణిమ కరుణావినిద్రమంబ ! 11

స్వరసమైన వీణా రవాస్వాదనమున
ఒడలెఱుంగనియానందముప్పతిల్ల
రవలతాటంక రుచులు పర్వంగ నీదు
స్నిగ్ధహసితముగలమోము నే స్మరింతు. 12

సరిగమపదని సుస్వరస్థానములుగ
నిరతి వీణను బలికించు కరములొప్ప
శాంత మతిమృదుస్వాంత ముపాంతకాంత
కచభరాక్రాంత మాయు మా కాంత గొలుతు 13

శిరము కంపింపవీణియఁ జిత్రలీల
మీఁటుఁచుండఁ దాటంకముల్ మెదలి కదలి
అవటు తలమందు వేణితోఁగవలు గూడ
కలకల వెలుంగునీమోమె కాంతునంబ ! 14

కుంద కుట్మలరుచి విల్చికొన్నయట్టి
స్నిగ్ధ దంతావళిచ్ఛవి చెదరి పర్వ
స్మేరణాధరమ్ము శ్రాసించిమించు
చారు వీణాధరా ! నమస్కారమమ్మ. 15

యౌవనంపులావణ్యదుగ్ధార్ణవంబు
సుముఖ పూర్ణచంద్రోదయస్ఫూర్తిఁబొంగ
కంబుబిబ్బోకభృత్కంధరంబు దాన
లభ్యమయ్యెనీకంచుఁ దలంతు నేను 16

ఫాల లావణ్యముప్పొంగి జాలువారి
స్వేదబిందూత్కరమిషమ్ముచేతజారి
అంబ ! నీనాసికామౌక్తికంబు తీరు
పొందెననుచు భావింతునేపూవుబోడి 17

తల్లి ! కచ్ఛపిన్నీవు గాంధారగాన
మాలపింపగమృగపక్షి జాలమెల్ల
జనకులయ్యు సప్తస్వర జాలమునకు
వినుచునుండునుచ్ఛ్వాసికలను వహించి 18

సర్వ తీర్థ మంత్రాత్మికా ! శరణు శరణు
సర్వతంత్రయంత్రాత్మికా ! జయము జయము
సర్వశక్తి పీఠాత్మికా! సర్వవర్ణ !
నాద యోగ విద్యాత్మికా ! నతులు జనని ! 19

మాత! రవిశశి దీప్తి మన్మండముల
కుండలములుగా దాల్చి మక్కువలు తొనకు
నమృతహసితాల భక్త పాపౌఘములను
కడిగివేసెడి మాతంగ కన్య వీవు. 20

శేఖరీభూతశీతాంశు రేఖ లెల్ల
స్నిగ్ధ నీలాలక శ్రేణిఁ జిందులాడ
అతను లీలా ధనుస్సులై యందగించు
భ్రూలతాసుమచయమె నీ పూర్ణదృష్టు 21

కాయకల్ప తరూద్భవ కమ్రదీర్ఘ
శాఖలే నీ కరమ్ములు శ్యామలాంబ !
లలిత హస్తాంతముల యంగుళములులలిత !
చివురు జొంపములట్లు రాజిల్లుఁగాదె 22

పంచ వర్ణ ముఖంబులఁ బంచరసము
లొలుక, పంచ విధాల చూపులఁ బ్రపంచ
పాంచ భౌతిక జీవి జీవాతువగుదు
కృత్తివాసప్రియా! నమస్కృతులు జనని! 23

పంచ పంచాయుధములఁ బ్రపంచశాంతి
చెఱుచు పాపాత్ములనుఁ బ్రభవించువీవు
అటులెపావనభక్తులనాదరించి
పరమ కృప చూపునట్టిశాంకరిని నీవు 24

పాద పద్మాంగులీనఖప్రభలయందు
ప్రతిఫలించు దేవంగనా భవ్య కచము
లపుడెయర్చించు దూర్వాంకురాలిగాఁగ
అనిశముందోఁపజేయు లోకైకజనని ! 25

గాథలను బల్కు మువ్వన్నెగళముతోడ
ఆకుపచ్చ నిపక్షద్వయమ్ముతోడ
తుండకాంతి కిం శుకములద్రోసివేయు
రా చిలుకతోడ క్రీడించు రాణివీవు ! 26

నీదు సర్వాంగములయందు నిలిచికొలిచి
పూర్ణనవరత్న భూషలు భూష్యభావ
మందెఁ గాని, నీ కవిభూషణాదులగునె?
లోక భూషణవీవు లోకైకజనని ! 27

శివుని బూజింప నీవుఁ బూజింపబడుదు
నిన్ను నర్చింప శివుడునుమన్ననగను
ఆతడాడిన బాడ నీ వటులొనర్తు
నిజమ అర్ధాంగి వగుటది నీకె చెల్లు 28

ధ్యాన ముద్రా విలీనుఁ డైజ్ఞానియవఁ డు
శాంతకుంభాకృతిగనుసుశ్యామలగను
చంద్రచూడాన్వితగ శివశక్తిఁ గాగ
తలుచునోనిన్ను ధన్యాతిధన్యుఁ డతడె. 29

చం(ద్రికాశీతలా ! చకచ్చకితకుండ
లా ! ఝుళంఝుళన్నూపురా! రణితరశన !
ధగ ధగద్ధగితాంగి! మేధాస్వరూపి
ణి; జగన్మాత ! నన్ను మన్నింప రావె? 30

కనక సూత్రమె మాయ, బొంగరములాత్రి
మూర్తులను, చుట్టి త్రిప్పెడుమోహనముగ
వారి చేఁజిక్కి మాయా ప్రబద్ధులమగు
మేమెటు భ్రమింపకుందుమే మీన నేత్ర ? 31

కింశుకాభ తను ద్యుతికిన్ దగంగ
దలితకౌసుంభరాగ వస్త్రము ధరించి
కనకకోటీర పుష్యరాగ ప్రభా వి
భాసితాననవైతి సౌభాగ్య జనని ! 32

మత్తమాతంగ గమన ! ఉన్మత్త చిత్త
కోకిలాలాప ! హాలాదిఘూర్ణితాక్షి !
మాన్య మాతంగ తనయ ! దుర్మత్త చిత్త
దుష్టసంహారిణీ ! నమస్తుభ్యమంబ ! 33

శత సహస్ర సూర్య ప్రకాశమునవెలుఁగు
నీ తనుద్యుతిముందు వన్నెలు తొలంగి
రత్నభూషలు దివ్యవజ్రముల రుచులు
మిణుకుమిణ్కుదివ్వెలరీతి మెదలు జనని ! 34

అమ్మ ! ఈరేడు జగముల నద్భుతముగ
ఎత్త నంగాయలాడంగనీవెతగుదు
అల త్రిమూర్తుల సూర్య చంద్రులను బట్టి
అబ్బురంపుఁజెండ్లాట నీ వాడఁగలవు 35

జనని! నీ శాంత తీక్ష్ణ వీక్షణ శతాంశ
కలన వెలిగెడి సూర్యచంద్రులు నభమున,
నీ ప్రవాలాభనఖర కాంతిని సహస్ర
భాగ భాక్కులై రిక్కలు పరిఢవిల్లు 36

పద్మకర ! పద్మ మాలిని ! పద్మ నేత్ర !
పద్మ దేహాభ ! పద్మ సంపన్న వదన !
పద్మ పదపద్మ ! పద్మినీసద్మ ! నతులు
పద్మినీ నాకుద్వత్పద భక్తి నిమ్ము 37

పద్మ మాలాధరా ! పద్మ భవ్య గంధి !
పద్మనాభ ప్రియా ! ప్రియపద్మ ! నతులు
పద్మ ! పద్మార్చనాతుష్టభావ ! నతులు
పద్మకేసర వర్ణినీ! వందనములు. 38

వదన విధు సుధ పొంగులు వారి జనని !
నీదు సీమంత సరణిని నిర్గమించి
మించి సర్వాంగముల వ్యాపించు కతన
నీకుగల్గె సుధా మాలినీ సమాఖ్య. 39

అంబ ! నీదునాజ్ఞా చక్ర మందు వెలుఁగు
కమ్రకాశ్మీర తిలక చక్రమె సమస్త
దుష్ట భంజన మొనరింపదో? మఱేల
నాయుధాంతరములు దాల్చు నవసరమ్ము ? 40

ఓసి! బాలార్క కోటి మహోజ్జ్వలాంగి,
నిన్ను గన్నెత్తిచూడవేనికిఁదరంబు?
కనుకనే దురారాధ్య ! దుర్గా ! యటంచు
నిన్నుపాసించుచుంద్రు సందియము లేదు. 41

అగ్ని ముఖముగ, శిరము బ్రహ్మగను, శౌరి
హృదయముగ, శిఖ రుద్రుడు, త్రిపదఁగాగ
పృథివియోనిగ, షట్కుక్షివిగను, పంచ
ముఖిగ శ్రుతి నిన్నుఁదెల్పెనంభోజ నేత్రి ! 42

అంబ ! "నిన్ను 'ఓజోసిసహోసి ప్రబల
మసిచ, భ్రాజోసి, దేవధామాసి, విశ్వ
మసిచ, విశ్వాయురనుచు, సర్వాయు" రనుచు
శ్రుతి వచించెనయ్యది యుపశ్రుతియె మాకు. 43

సంపదలు, విద్య, అభయ మోక్షములు గోరి
వేఱువేఱు గ నిన్ను భావింతు మేము
నీవు వివిధ రూపముల మన్నించి మమ్ము
వాంఛితార్థమ్ము లిడుదువే వామనయన ! 44

లసదుదారవీక్షాపరిభ్రామ్యమాణ
సకల బ్రహ్మాండమండలా ! చారు చర్య !
ఓ చలత్కుండలా! నమదుత్తమాంగ
సేవ్యదాఖండలా ! చిదచిత్స్వరూప ! 45

పుట్టుకలు చావులాయుఃప్రమోషములును
వార్ధకములును రుగ్మతలు మాపాలఁబెట్టి
తప్పుకొంటివి వానికి ధర్మమమ్మ?
తల్లి బిడ్డలకిడు సంపదలివటమ్మ ! 46

జనని ! నీ పూజకిడు పుష్పచయము, పత్రి
పువ్వునవ్వులతోఁబొలుపొందినటులు
అన్య సుమములు కొమ్మలనంటివాఁడి
దుఃఖ పడి రాలు చున్నట్లు దోచునాకు. 47

కలతలంబడి స్వాంత నిశ్చలతలేక
లేవ డబ్బెత్తు సత్తువ లేక నీ స
పర్యలొకపూటమానుచోఁబాపనిచయ
మశుచి మము దిగఁద్రొక్కినట్లానునమ్మ ! 48

పుట్టు చుందు పుట్టుకలేని పొలతివయ్యు
అరులవధియింతువు నిరీహురాలవయ్యు
మెలఁకువవహింతు నిద్రలో మునిగియున్న
పరుల వాంఛలఁదీర్తు నిర్వాంఛవైన. 49

నీ కవాప్తానవాప్తముల్ లేకయున్న
నీదు జన్మ కర్మంబులు నిజమెఋంగ
లోకములనుద్ధరించుట కే కదమ్మ
ఎంత నిస్వార్ధ వే జననీ! నమోస్తు 50

గాత నీ కెప్డు ముఖ్య సంత్రాతగాన
నిన్ను గాయత్రి గాఁగ ధ్యానింతుమంబ !
సవితలో నీవు నిత్యవాసమ్ముఁగొనుట
వేదమాతృక ! నీవు సావిత్రి వైతి. 51

వేదవేదాంగశాస్త్రాదివిద్యలెల్ల
త్వత్స్వ రూపమౌటను సరస్వతివి నీవు
లీనవై త్రిసంధ్యల సంచరించుకతన
నిన్ను సంధ్యా మయిగను ధ్యానింతుమంబ. 52

హరి విరించి శక్తులుగ నీ వమరుకతన
వైష్ణవిగ బ్రాహ్మి గాగ భావనల నిలుతు
నిత్యసంశుద్ధవై నీవు నెగడుకతన
నిమృజియంచు నర్ఘ్య ము లిచ్చి నినుభజింత్రు. 53

మొనసిముమ్మాఱు నీ మంత్రమును బఠించి
అర్ఘ్య మిడినంతనద్ది వజ్రాయుధమయి
బాలభాను బాధించు క్రవ్యాదగణముఁ
దివిచి నెట్టును చీకటి దిబ్బలకును. 54

క్రోధ మాత్సర్యలోభ దుర్గుణ గణంబు
అశుభమతి తొలగించు నంబా, భవత్ప్ర
కీర్తనమటంచుస్మృతిపల్కుఁ గేవలమది
అర్థవాదగా నాయెడ నయ్యెనమ్మ ! 55

ప్రాణులందు నిచ్ఛాక్రియాజ్ఞానశక్తు
లోలి లక్ష్మి సరస్వతీ కాళికలుగ
రూపు కల్పించి కొల్తుమో లోల నయన !
నీవు మాలోని దానవే కావె జనని? 56

నీవు పలుతావులందున్న దైవములకు
ధర్మపత్నివై నామ బేధములతోడ
అర్చలందుచుఁదనిసి భక్తా వనమ్ము
చేయు చున్నావు చిత్రవిచిత్రలీల. 57

సారమతి పరివ్రాజక చక్రవర్తి
శంకరుడు శక్తివాద భంజనమొనర్ప
తొలగఁతాతనినుండినీ, వులికియతడు
లలిత! నినుగొల్చె సౌందర్యలహరి కృతిని. 58

అక్షరము బ్రహ్మ సమ్మితమ్మైననీదు
భవ్య మంత్రము సకలపాపక్షయమ్ము
అగ్ని దేవతాకము, పరమాత్మ రూప,
మిడును సాయుజ్యమని శ్రుతి నుడివె జనని ! 59

అబ్ధిజగను మాతంగిగ హైమవతిగ
దాక్షిగా నిన్ను కృతులు సంస్తుముసేయు
దక్షయజ్ఞాన నీ దేహ దాహమగుట
నీకు నాద్యంత హీనత నెగడునెటులో? 60

ధర్మము సముద్ధరింప నెదన్దలచుట
ధర "అజాయమానాబహుధావిజాయ
సే "యనెడి శ్రుతి నీదు విచిత్ర చరిత
లకు సమన్వయ రీతియా లలిత ! చెపుమ? 61

దేవి ! లోకకంటకుల మర్దించి నీవు
మోక్షమిడుచుంటి విది వైరమునకు గుఱియె
వైరములు మరణాంతముల్, బ్రదుకనిచ్చి
తిప్పలిడవలెఁ జంపిసాధింతు వేమి? 62

సకల రక్షోఘ్న మంత్రముల్, సకలదేవ
తా ప్రసాదనమనువు, లుద్భట దురంత
రోగ శమన తంత్రములు నీలోనివగుట
సకల మంత్ర తంత్రాత్మగా సాగెదీవు 63

వెల్లువను గొట్టుకొని పోవు పుల్లరీతి
జనన మరణ ప్రవాహ సంసరణ మందు
బుట్ట మున్కలనుంటఁజేపట్టునొసగి
ననుసముద్ధరించుటది యేనాటికమ్మ? 64

తన్వి ! నీవారశూకవత్తన్వివగుచు
సిగను బరామాత్మఁజెరివివాసించి, యణువు
భాతి, పీతవర్ణముగ, జీవాళిలోనఁ
జొచ్చి మాకందకుండుట చోద్యమమ్మ 65

మతి భవత్పదములయందు, మాట నుతుల,
కనులు నీరూపునందు, నీ కథల శ్రుతులు
ధ్యానమున బుద్ధి, కర మర్చనాదియందు
నిలువ నా కన్యమేల కావలెను జనని ? 66

సారమే లేని, త్వత్పద దూరమైన
తుచ్ఛ సంసారమందుఁ జేదోడు లేని
యంధుడను, నన్ను మించిదీనాతి దీనుఁ
డెవడురక్షింప నీకు శాంభవి వచించు. 67

కొండలు సరస్సులారామకుంజములను
అరయలేను నీ పూజాసుమాళికొఱకు
భక్తి హృత్పద్మమిడెద నీ పాదమందు
నన్ను నీవానిగాఁ జేసికొన్నఁజాలు 68

మంత్రహీన క్రియాహీన తంత్రహీన
భక్తి హీనము నా సమభ్యర్చ జనని !
సంభవద్వస్తు చయముచే జరుపు కొనఁగ
నైతి, నీకిది పరిపూర్ణ మౌనుగాత. 69

అంబ! నీకు సమస్త దేవాది దేవ
పత్ను లెల్లదాసీలు, నీ భవ్య మంద
పావన కటాక్ష సంలబ్ధ వైభవు లట
అల్ల బ్రహ్మేంద్రగంగా ధరాదులెల్ల. 70

మంగళములకుఁ గూడ సన్మంగళమిడు
సర్వ మంగళ వీవు నీసాటిగలరె?
ఈవుసర్వార్థసాధకి, వీవె సకల
లోక దీపాంకురమవు విలోల నేత్ర ! 71

కడపఁగలమునూతేండ్లునిన్గాంచుచుండి
బ్రతుకఁగలమునూతేండ్లు త్వత్పదము పట్టి
త్వన్నుతులొనర్చుచు శతమ్ముబ్రతుకఁగలము
శతము మోదింతుమమ్మ తత్సవిధఁజేరి. 72

ఆదిశక్తి "ధియోనఃప్రచోద యా" త్త
టంచు శ్రుతి పల్కు, నిది సత్యమైనయెడల
ధర్మముగ సత్యముగఁబరార్ధమ్ముఁగాగ
ధీ ప్రచోదన మాకు సంధింపుమమ్మ. 73

మేఘ సవిధ విద్యుల్లేఖ మెలఁగు నటులు
ధగధగద్దీప్తి వెలిగెడి తల్లివీవు.
ఉష్ణ రశ్మి చంద్రాగ్నులందున్న భవ్య
దివ్య తేజస్సమృద్ధి నీదే గదమ్మ. 74

విగ్రహారాధన మ్మ వివేకమనుచు
పద పునశ్చరణమ్ము నిష్ఫల మటంచు
కర్మఠులకల్పనల్ సర్వ కర్మములని
అందురమ్మ తత్ప్రేరణమద్భుతమ్ము. 75

త్వన్నయన రక్త కాంతులుద్ధత సురారి
గర్వచర్వణదావాగ్ని కణములగును
శ్రీపదార్చిత రత్న మంజీర రవము
లరులగుండెలలోన ముద్గరములమ్మ. 76

నీదునిశ్శ్వాసములు దుష్ట నికర ఫణుల
రొప్పి పిప్పినిజేయు గా రుత్మతములు
నీ నఖర దీప్తి పుంజముల్నిర్నిరోధ
రిపువిఖండన నిశిత శిలీముఖములు. 77

ఆరులపైనగ్గి కురియించు నట్టికనులె
తతదయావృష్టి కురియు భక్త తతి పైన
పగర చీల్చి చెండాడు నీ భద్ర కరము
లభయహస్తములౌభక్తులందు జనని! 78

త్వన్ముఖాక్షిపాదకర పద్మముల కడల
కలయఁదిరుగును నా మనఃకపి సతమ్ము
నలిపివేయక దళభంజనము సలుపక
కాచుకొనుమమ్మ ఓ సామగానలోల 79

జగతి యను బొమ్మరిల్లు చక్కగ ఘటించి
మమ్ము తాటాకు బొమ్మల మాడ్కి నిలిపి
పూలతేనెలుకజ్జాయములను గూర్చి
ఈవుఖేలింతు బొమ్మ పెండ్లిడ్లయాట 80

మూగవానిని వాచాలుఁగాగఁజేయు
పంగుపున్దాటగాఁజేయుఁబర్వతమును
అంధునిన్ లోకవీక్షా సమగ్రుఁజేయు
నీదుసత్కృపా వీక్షణ నిరతి జనని ! 81

వాణిగా హరిప్రియ గా భవానిగాఁగ
ఏయమదలంత్రుశాకంభరీయటంచు
సృష్టిసుస్థితిలయంబులంజేయునెవతె
అట్టిత్రిభువనగురుపత్ని కంజలింతు. 82

సిరులొసంగునింద్రియతృప్తిచేయు నిఖిల
పాపములడంచు సామ్రాజ్య పదమొసంగు
త్వత్పదార్పిత నతితతుల్ తల్లి ! గౌరి
ఈయకించను దీను మన్నింపలేవె? 83

త్రికరణ విశుద్ధి నీసేవఁ దీర్చుకొనుచు
చిరము నీ కటాక్షము నుపాసింతుమేని
సేవకుని కఖిలార్ధ సంసిద్ధిగ లుగు
జనని! శాంకరీ! నా నమస్కారమంబ! 84

అంబ! పద్మాలయా! పద్మ హస్త స్వచ్ఛ
వస్త్రమాల్యానులేపనా! భగవతీ! స
మస్త లోక సంపత్కరీ! హర వధూటి
నతులు నుతులు శాంభవి ! త్రిసంధ్యమ్ము నీకు 85

దిక్కరుల్ స్వర్ణ కలశలఁదెచ్చిపోయు
నమల గంగచే జలకము లార్చినట్టి
లోకమాతకు సర్వలోకైక విభుని
కాంతకగుఁగాత నా నమస్కార శతము 86

శాంతిమతి ! కమలాక్షి ! జగజ్జనని ! వి
భూతి రూపిణి ! అమర సంపూజితాంఘ్రి !
అతులపూర్ణ దయామయి! నతులు నీకు
సర్వమంగళ దేవతా! జయము జయము 87

కర దశకమును ముఖ పంచకమ్ము నీవు
తాల్చుటదియు లోకావనార్ధమ్ము కొఱకె
ఇన్ని విధముల వీక్షించు చున్ననేని
జనత పాపాచరణవృత్తి సమయదంబ 88

కర్మమని పాపమని వ్యర్ధ కథల నడ్డు
వెట్టిఁదాఁటించుకొంట నిర్వీర్యఫణితి
భీరువులొనర్చు పనిగ భావింతు నేను
ఉప్పనిన నీవు నారెండునుడిగిపోవె? 89

చంద్ర ! చంద్ర సహోదరీ ! చారు రూప !
చంద్ర శీతల, పూర్ణిమా చంద్ర వదన !
చారు చంద్ర కలాధరా! సారహృదయ !
పూర్ణ శతకోటిచంద్రాభ ! మ్రొక్కులివియె. 90

అంబ! నే నపరాధసహస్రములను
ఆచరించుచునుందునహర్ని శంబు
అట్టి దుష్కార్యచింతలోఁ బుట్టువెంట
నెదుటికి వచ్చి నన్ను దండింపవమ్మ 91

జనని ! "ధర్మేణపాపమపనుదతి" అని
శ్రుతి వచించినదజ్ఞాన కృతము నకట;
ఈవుసర్వ పాపముల హరించుచుండ
ధర్మబంధంబదేల? త్వద్దయయె చాలు 92

దుర్లభము నరజన్మ మందునను విప్ర
కులము పురుషత దుర్లభంబులు గదమ్మ
వాని నొసగితి నిను మరువంగనగునె?
తారకానన ! కుందావదాతరదన ! 93

ఉఫ్ఫుననినాఁటుదివ్వెగా నున్న నన్ను
ఎగసనంద్రోసివెలిగింతు వేల జనని?
గుప్పెడుతమంబునేనిపోఁ గొట్టుకొనని
యీ కునుకుదీపమెందులకే మదంబ? 94

మనసు చంచలమాపైని మాట దురుసు
క్రోధమధికము దుందుడుకుందనమ్ము
హెచ్చు, సంఘము లోన నేనెట్లుబ్రదుక
నేర్తు నీదయ లేకున్న నిగమ వేద్య? 95

క్షుద్ర ఫలదలు భువిని లక్షోపలక్ష
లైనశక్తిమూర్తులుకల, వైన నాకు
వానితోబని లేదు మద్వాంఛితమ్ము
త్వత్కటాక్షమ్ము, తారకేశ్వరి ! యదిమ్ము 96

పుత్త్రకుడుఁ పున్నామ నరకమ్మును తొలఁచడు
భార్య సంసృతిభరముఁబాపంగలేదు
"ఆత్మనాత్మా నముద్ధరే" త్తనెడి మాట
సత్య, మాశక్తి నాకు నొసంగు జనని! 97

జనన మరణ తరంగ సంసార జలధి
కాళి ! త్వద్భక్తతతికి మోకాలిబంటి
"వస్తుసర్వంభయాన్వితం భవతి" యనగ
విందు మభయప్రదాత్రి వీవే గదమ్మ 98

అడుగడుగు గండ మగుచుఁ దానంధకార
బంధుర దురంతకూపమీభవము తల్లి !
ఇందు దిగఁబడకున్న వాఁడెవడు లేడు
ఉద్ధరింపగ నీబోటి యువతి లేదు 99

పరమ యోగిగా త్యాగి బాబాలుగాఁగ
జటి పరివ్రాజకునిగ నే సాగలేను
అంబ ! అన్నగత ప్రాణి, ననవరతము
నీకు దాసానుదాసుఁడై నెగడువాడ 100

ఎద దలంచితినొండు, కావించితొండు
వాంఛితంబొకడైన తీర్పంగ లేదు
విష మమృతమగు నమృతము విషమెయగును
నీ తలంపుచే, దెలియగ నేర్చు నెవడు? 101

అంబ ! సావిత్రి ! నీవు దయామృతమును
కురియుచున్నావు సర్వత్ర కుతలమందు
కాని నే నభాగ్యచ్ఛత్ర మూనినాడ
పడదయొక బిందువైన నా పయి నిజమ్ము 102

అస్తగిరిదేవళంబునందధివసించు
రాజరాజేశ్వరియె రవి రక్తబింబ
మర్చచేసిన కుంకుమంబాయుషస్సు
తారకలు మంత్ర పుష్పాల తీరు నందె 103

ఈజగన్నాటకమున గుర్తించి నీవు
నాకిడిన పాత్ర నటియించినాడ ససిగ
మంచిని గ్రహించి దొసగు మన్నించి నీదు
సన్నిధింజేర్చవే జగజ్జనని చాలు. 104

భవ్య మాతంగకన్యకాభరణముగను
అమరిచితి దివ్యరత్న మాల్యమును, దీని
భక్తి నెవ్వడుపఠియింప వ్రాయ వినిన
పూజ్య వాగీశ్వరత్వము పొందు నిజము 105

మల్లేశ్వర శతకము

మున్నుడి

పుణ్యగోదావరి మూడుపాయలు ఆత్రేయ, భరద్వాజ గౌతమిల సంగమస్థానమే (మస్కరపల్లి) మసకపల్లి. ఇది నా జన్మస్థలము. ఇది ద్రాక్షారామానికి సుమారు 7 మైళ్ళ దూరములో ఉన్నది.

ఈ పవిత్ర ప్రదేశములో భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవాలయం వెలసినది. ఆయన మా గ్రామానికి ఆరాధ్య దైవము.

ఇక్కడి శివలింగం సుమారు ఎనిమిది అంగుళములు ఎత్తు, గౌరవర్ణము కలిగి ఉంటుంది. ఈ శివలింగమునకు కుడివైపున రక్తవర్ణములో మచ్చ కలిగి ఉంటుంది. "కిరాతార్జునీయ" గ్రంథములో దీని వివరణను మనము గమనించగలము.

పరమేశ్వరుడు నా ఆరాధ్యదైవము. అందువలననే ఈ "మల్లేశ్వర శతకమును"ఆయన కృపాకటాక్షము వలన వ్రాయగలిగితిని. బుధజనులు చదివి ఆనందించవలసినదిగా నా మనవి.

దువ్వూరి సూర్యనారాయణ మూర్తి

భూమికా

నమస్తే యోగి హృద్గమ్య! నమస్తే పాప నాశన!
నమస్తే సర్వభూతేశ! శ్రీ మల్లేశ! నమోనమః

అజ్ఞాన తిమిరాకీర్ణ విమూఢ జ్ఞాన చక్షుషాం
కథం నిష్కామతా స్మాక మాశాపూరిత చేతసామ్

నిష్కామ కర్మ కరణా న్మోక్షోస్తీతి విద న్నపి
న మయా క్రియతే తద్వ త్పూర్వసంచిత కర్మణా

నమన్ ధ్యాయన్నర్చయన్‌చ సర్వదా సంస్మర న్నపి
త్వత్తో రక్షాం యాచమానో మోహేమగ్నో భవామ్యహమ్

తత్స్వరూపం వినిశ్చేతుం జ్ఞానిన స్తత్వవేదినః
అనేక వక్రమార్గేషు యాతాయాతం ప్రచక్రిరే.

ఆదిశక్తే స్సముత్పన్నాః త్రిమూర్తయ ఇతీ రితాః
తస్మా దేవైక మేవా ద్వితీయం బ్రహ్మేతి కథ్యతే.

నా యం పంథా రోచతే మే మహేశ!
నే యం దృష్టి స్తుష్టి మాయాతి మహ్యాం
నే యం సూక్తి ర్భక్తిమార్గం దదాతి
నేదం జ్ఞానం ముక్తిమార్గానుగుణ్యమ్.

కేచి "ద్బ్రహ్మానంద" మేవేతి ప్రోచుః
కేచి "ద్బ్రహ్మోంకార" రూపం ప్రచక్రుః
కేచి"త్సోహం బ్రహ్మ" ఇ త్యావదంతి
కేచి త్ప్రాజ్ఞాః"తత్వమసీ"తి ప్రోచుః

కేచి "దాత్మా బ్రహ్మ"ఇ త్యుచ్చరంతి
కేచిత్ "జ్ఞానం బ్రహ్మ" ఇ త్యాచరంతి
కేచి ద్బ్రహ్మ నాస్తి నాస్తీతి మిధ్యా
వాదం వదంతి పరిత స్సంవిశానాః

యే యం బ్రహ్మణ మభిసంవిశాన
శ్చరంతి మార్గేష్వతి గుంఫితేషు
తేషాం ముక్తిర్వర్తతేవా నవేతి
సందేహో మాం బాధతే దేవదేవ!

నానారూపా ణ్యాశ్రితస్సన్ జనానాం
సౌఖ్యం దుఃఖం కల్పయ న్మాయయా చ
యో మాం ధ్యాయే త్స విముక్త స్సుఖీతి
చాన్యోదుఃఖీ తిబ్రువ న్వర్తసే త్వమ్

మాయావృతో జడధీ స్సక్తచిత్త
స్తత్వం సత్యం నైవ జానే హ మీశ!
సర్వాత్మనా వర్తమాన స్త్వ మేవ
నా న్యో స్తీతి ధ్యాతు ముద్యుక్త ఏవ.

జానంతు త్వాం భిన్నభిన్న స్వరూపం
జానంతు త్వాం కష్టదం దుఃఖదం చ
జానే హం త్వా మేక మేవాద్వితీయం
బ్రహ్మే త్యేవం సౌఖ్యదం సర్వ దేతి

తిష్టంతు మార్గాః శ్రుతి సమ్మతాశ్చ
తిష్ఠం త్వనేకే స్మృతి చోదితాశ్చ
పంథా మయాయంతు నివేది తోద్య
ప్రసీద మల్లేశ! జగ న్నివాస!

ఆభాస చైతన్య మివాంతరాత్మా
ఆనంద మాప్నోతి మహాంత మద్య
త్వన్నామ సంకీర్తన మేవ కర్తు
మావిష్కరోత్యుత్సవ మాదిదేవ!

నా స్తీతి వక్తుం న హిమే శక్తి రస్తి
బుద్ధి ర్నాస్తీ త్యేవ ముహ్యేత దేవ!
సంశయాత్మా నశ్యతీ త్యాది శ్రుత్యా
అస్తీతి త్వాం నిశ్చినో మ్యాదిదేవ!

హృష్యంతు వా బుద్ధిమాంద్యం విలోక్య
రుష్యంతువా లౌకికాస్త న్మమేతి
సాధ్వసాత్మా నాస్తి నాస్తీహ దేవ!
శ్రద్ధాం యాచే సేవితుం వాక్సుపుష్పైః

– ఇతి – సుధీ విధేయ స్సూర్యనారాయణః

శ్రీ మల్లేశ్వర శతకము

దువ్వూరి సూర్యనారాయణ మూర్తి

వరములొసగితి వనుచుబిరబిర
కరములను జోడించి తంతియె
వరములీయక కొలుచునంతటి
తిరుఁడగాను శివా!

పరమకరుణా పరుడవని నిను
తరుణమున సేవించి తంతియ
యెరుగవా? మాబొల్లిప్రేమల
తెరగు మల్లేశా!

ఆపదలు పొడసూపెనని నే
కాపుదలచేయించు మంటిని
ఆపదే లేకున్న భక్తిని
జూపమల్లేశా!

కుటిలభక్తిని జూపుచున్నను
చటులమననము సేయుచున్నను
చటుకుమని దరిచేరికాచితి
వెటులొ మల్లేశా!

కాలసర్పము ఘాతకెంతయొ
బేలనైతిరుగాడుచును నీ
పాలబడి నందులకు బ్రోచితి
చాలుమల్లేశా!

ఇష్టసిద్ధిని కూర్చుటకు నీ
సృష్టిలో నీకన్న నెక్కుడు
దిష్టమేలేదదనుచు కొలిచితి
దేవ! మల్లేశా!

చేయుదువ? యీపాటి యుపకృతి
చేయవా? యనుకొంటి నాకు న
పాయ మేమియులేక కాచితి
వోయి మల్లేశా!

కలుగు కష్టములోన సుఖమను
పలుకురీతిని బొంకొనర్పక
కలకలను నవ్వించి తేడ్పును
గెలువ మల్లేశా!

బీదవాడను నీకు నభిషే
కాదు లేమియొనర్ప గలుగుదు?
నాదరము నాపైని విడువవు
గాద?మల్లేశా!

లంచముల నీదలచినాడ న
టంచు కోపమునందకుము నా
సంచితార్థము తృణమునైనను
గాంచ మల్లేశా!

కదలకను ధ్యానింతునా? నిలు
వదుకదా? యీమాయచిత్తము
బ్రదుకు రోజులలోన నేవియొ
సొదలు మల్లేశా!

నిముషమైనను నీదు మృదుపద
కమల సేవను జేయుటకు మా
కమితమగు సంసార బాధలె
యమరు మల్లేశా!

అన్నగతమగు నసువుతో తను
వెన్ని గడియలు నిలిచియుండెడి
నన్ని నాళ్ళను నీదుభజనము
సున్న మల్లేశా!

కాముబాధల కట్టుసాపుచు
నీమమడచి వివాహితులమై
లేమలకు జిక్కక తొలంగగ
లేము మల్లేశా!

కాంతకెప్పుడు జిక్కి సుఖముల
చింత చేయుచు పాశవము నా
వంత వీడగలేని తరినిక
చింత మల్లేశా!

దినము దినమంతయును పాశవ
ముననె గడపుచు నుండగను నీ
మనన మెవ్వరికోయి సుఖముల
గనక మల్లేశా!

తోడనే సంతతియు గలుగును
తోడనే యాశలు జపించును
తోడనే ధనకాంక్ష పెరుగును
చూడు మల్లేశా!

ఇంక కావలె నిండ్లు వాకిం
డ్లింక కావలె పాలగోవులు
ఇంక కావలె ధనము ధాన్యము
వింక మల్లేశా!

చుట్టె నాశాపాశ మురియై
చుట్టె మోహభుజంగి కాలకు
జుట్టె సుఖదుఃఖములు మమ్ముల
బట్టి మల్లేశా!

పుట్టుచును గిట్టుచును సంతతి
మట్టిపాలగుచుండ సుఖముల
పెట్టిపుట్టముగాద? బాధలు
జుట్టి మల్లేశా!

సంతతికినై వంతయా? నీ
పొంతకై పెనుచితంయా? యా
వంతబోధింపవు గదా? యీ
సంత మల్లేశా!

ఒక్కకంటను నేడ్చుచును వే
రొక్క కంటను నవ్వుచును నో
ప్రక్క నీ సంస్మరణ చేయుట
చిక్కు మల్లేశా!

చెప్పెదవు నీకేమి? నన్నే
తప్పకను ధ్యానింపుమని మా
కెప్పగిది సాగెడిని యెప్పుల
కుప్ప మల్లేశా!

తలపమస్థిరములని తనువులు
తలపమస్థిరములని ధనములు
వెలికి నసువులుపోవ నన్నియు
కలలు మల్లేశా!

తల్లియట తండ్రియట భార్యట
పిల్లలట యీమాయవరుస ల
వెల్ల చచ్చిన దానితోడనె
చెల్లు మల్లేశా!

మాయనాటకమును రచింపుచు
మాయపాత్రల సృష్టిచేసి య
మాయకునిపోలికను చూచెద
వోయి మల్లేశా!

ముక్కుమూసుక నీదుధ్యానము
చక్క చేయుదమన్న మానస
మెక్కడో యేసందు గొందునో
చిక్కు మల్లేశా!

భజన లుపవాసములు ఘన భే
షజము చూపుచు జపతపంబులు
నిజము భక్తులవలె నొనర్తురు
ప్రజలు మల్లేశా!

వ్రతములేలను తపములేలను
పతితపావన! నిన్నుకొలువగ
నతులితంబగు నాత్మపూజయె
సతము మల్లేశా!

సర్వభూతము లందునీవే
సర్వవస్తువు లందునీవే
యుర్వియంతయు నిండియుంటివి
శర్వ! మల్లేశా!

జీవమందరి కొక్కటే సం
జీవి నిత్యమటంచు తెలిసియు
జీవహింసను చేయమానదు
జీవి మల్లేశా!

జీవమే జీవులకు జీవన
మై వరలునను వాక్యపద్ధతి
జీవిమాత్రమునకు తొలంగదు
దేవ! మల్లేశా!

జీవహింసకులమని మమ్ముల
చావతిట్టెదవేలనిక మా
జీవహంతవు నీవెకావా?
దేవ మల్లేశా!

జనులొనర్చెడి పనులనెల్లను
కనుచు తప్పిది యొప్పిదందువు
కనరుపరు లెవ్వరును నీవగు
పనులు మల్లేశా!

నీదుచేతకు మాదుచేతకు
భేదమున్నది యాదిదేవా!
మాదుచేతయె కొంతసౌమ్యము
శ్రీద! మల్లేశా!

పాలపాపల ముద్దుబిడ్డల
కాలమందున్నట్టి వారల
జాలిలేకను చంపుదువు నీ
లీల మల్లేశా!

పూలపిందెల పండ్లతోడను
చాలతూగుచునున్న సంసా
రాలజూచి సహించలేవీ
వేల? మల్లేశా!

కృపణుకోటీశ్వరుని జేయుదు
వెపుడునిర్ధనుజేతు దాతను
నెపమువేతువు సజ్జనునిపై
నెపుడు మల్లేశా!

ఆయువధికము దుర్మదాంధుల
కాయువల్పము ధర్మపరులకు
ఆయువున్నను బాధలధికము
లోయి మల్లేశా!

ఒక్కపూటకె లేనివానికి
పెక్కుసంతతి గూర్తు, ధనికుడు
పెక్కుకాంతల గూడ సుతులుహు
ళక్కి మల్లేశా!

కడుపునిండగ తినిన యరుగక
పడునుబాధ యజీర్తిచే ధని
కుడు; నిరర్థుడు కడుపుమంటను
బడెడి మల్లేశా!

లెక్కపెట్టిన నీదుసృష్టిని
మిక్కుటంబులు కానిపనులీ
ఫక్కిమానగలేవు నాయము
దక్కి మల్లేశా!

కానియాంతర దృష్టిచూచిన
జ్ఞానిత్వత్కృతములని మనమున
నైననెంచడు నిందచేయడు
పూని మల్లేశా!

జగముమాయావృతము రేయిం
బగళులన కనుమూతతెరువులు
నిగళయుగమీ కర్మపాశం
బగును మల్లేశా!

చన్నజనిలో జీవములు కను
మిన్నుగానక పాపపుణ్యము
లెన్ని చేసేతను నొనర్చెనో?
పన్ని మల్లేశా!

పుణ్యఫల మానందరూపమ
గణ్యమవ్యయ మప్రమేయ! శ
రణ్యమగు జీవికిని, పాప మ
రణ్యమగును శివా!

నిత్యధీమంతుం డకామ్యుడ
నిత్యధీమంతుండు కామ్యుడు
సత్యముగ కామ్యునకె బాధలు
నిత్య! మల్లేశా!

భవదధీనము నాదుహృదయము
భవదధీనము నాదుస్వామ్యము
భవజనిత బాధలను బాపుమ
శివుడ! మల్లేశా!

పాపచింతలుమాన్పి మాకగు
నాపదలకడ్డంబు పడు నీ
ప్రాపుకోరుచునంటి నీవే
కాపు మల్లేశా!

భూషణము లీ లేను భక్తుల
వేషములు వేయంగజాలను
భేషజములే లేవు భక్తసు
పోష మల్లేశా!

నీదుధ్యానము నీదుభజనము
నీదు సంస్తుతికన్న నాకిక
లేదు కృషి యన్యంబు శంభో!
శ్రీద! మల్లేశా!

అరమరలు లేకుండ నీ సం
స్మరణ చేయుచునుంటినని నీ
చురుకు చూపకుమయ్య మస్కర
పురము మల్లేశా!

చురుకు చూపిననిన్ను లోకులు
హరుడు ఖరుడును రాజసుడు పుర
హరుడనుచు దెప్పుదురు మస్కర
పురము మల్లేశా!

ఏమినోములు నోచుకొన్నదో?
యేమివ్రతములు చేసికొన్నదో?
యీమహాక్షేత్రమ్ము మస్కర
భూమి మల్లేశా!

మాతగౌతమితల్లి నిత్యము
శీతలోదక పాయసంబిడి
ప్రీతిపెంచెను మమ్ము సుగుణో
పేత మల్లేశా!

తల్లిగౌతమి తండ్రినీవని
యుల్లమందున నమ్మినందుకు
వల్లకాడొనరిచిరి గ్రామం
బెల్ల మల్లేశా!

ఉన్నవారలలోన పెద్దలు
పిన్నలను భయభక్తి చచ్చెను
ఉన్నమట్టుకు ముష్టిపాత్ర లి
వన్ని మల్లేశా!

మెట్టపల్లము భూములన్నియు
చుట్టికడుపున పెట్టుకొన్నది
చిట్టిమాగౌతమికి ఎంతటి
పొట్టో? మల్లేశా!

ఒకరినుడులన మా కహృద్యము
లొకరిచేతలు విషము, కప్పల
బెకబెకలు మామతము ప్రజ కో
రికలు మల్లేశా!

పొరులొక్కరితోడ నొకరును
చేరిపలుకరు చూడ"నెవరికి
వారె యమునాతీరె" యన్నటు
లైరి మల్లేశా!

సిగ్గులజ్జలు సన్నగిల్లెను
ఎగ్గులన్నియు మంటకలిసెను
బొగ్గులయ్యెను పొరుగులన్నియు
తగ్గి మల్లేశా!

గురులు గురుభార్యలును తల్లులు
పరులు స్త్రీయలటన్న వావులు
వరుసలెల్ల నశించె పాశవ
గరిమ మల్లేశా!

జారచోరులు దుండగీడులు
ఆరితేరిన తంత్రకర్తలు
క్రూర నిబిడీకృతము మాదగు
నూరు మల్లేశా!

పొందుపడునా? యనినవేనే
మందు? నీచలవే యిదంతయు
ముందుకలదు ముసుళ్ళపండుగ
పొంద మల్లేశా!

ఉంటివా మస్కరపురంబున
నుంటివా? మాపాలిదైవమ
తొంటిరూపు తొలంగెనా!ము
క్కంటి మల్లేశా!

ఉన్ననీగోలేల? చూచుచు
నున్న నీపోరేల? కాచుచు
నున్న కలహాలేల? బ్రోవగ
దన్న మల్లేశా!

సకల సౌభాగ్యములు కూర్చుచు
సకలజనులకు సౌఖ్యమిచ్చుచు
ప్రకటసౌహార్ద్రం బొసంగుమ
యికను మల్లేశా!

బ్రదుకు బ్రదుకంతయును పిడికిట
నదిమి నీమృదుపద భజనచే
యుదుము పెరచింతనలు మానుక
సదయ! మల్లేశా!

భక్తులముకామా? స్మరింపగ
శక్తియేలేదా? ముకుంద! వి
రక్తులము కామా? యిదేమి కు
యుక్తి మల్లేశా!

ఏడిపించెదవా? జనావళి
పాడియగునయ్యా? స్వజనులను
చూడరావయ్యా! మదంబిక
గూడిమల్లేశా!

పలకరించెదవా? తనూలత
పులకరించునయా, హృదబ్జము
కలతజెందునయా, స్మరించుచు
నిలువ మల్లేశా!

తినుటకేదయ్యా? రవంతయు
మనుటకేదయ్యా? పరుండిన
కునుకులేనయ్యా దయామతి
కనుము మల్లేశా!

గోచరుండవు సూక్ష్మదృష్టి క
గోచరుండవు స్థూలదృష్టికి
నీచమత్కృతి సర్వజీవుల
బ్రోచు మల్లేశా!

కాలరూపుడవై చరించుచు
లీలజనకృత పాపపుణ్యము
లాలకింతువు భక్తజనపరి
పాల మల్లేశా!

కనెడివారెవరనుచు పాపము
పనుల జేయు నమాయకవు జీ
వనుల యజ్ఞతకై హసింతువు
కనుచు మల్లేశా!

శాపదగ్ధులమైతిమా? మా
పాపమేనా? యీఅయోమయ
కూపనిత్య నివాసమేనా.
జూప మల్లేశా!

పుణ్యకార్యము లణగిపోయె న
గణ్యమయ్యెను క్రౌర్యమిక షా
డ్గుణ్యమూర్తీ! కావు దీన శ
రణ్య! మల్లేశా!

ఋణములన్నిటిలోన భక్తుల
ఋణముదీరుట కష్టమో ని
ర్గుణ! పరాత్పర! బోధకెంతటి
చణుడ? మల్లేశా!

మోక్షదాతవు భువనములు నీ
కుక్షిదాల్చిన భీకరుండవు
పక్షపాంతబేల నీవే
సాక్షి మల్లేశా!

గడచె వయసు సగంబునేటికి
పిడుగువలె నుంటిమి రవంతయు
కడగిచేసిన దెల్ల భూమికి
చెడుగె మల్లేశా!

నిత్యమును కీర్తిప్రదంబును
భృత్యసమ్మతమైన కార్యము
సత్యముగ జేయంగలేదిక
నిత్య! మల్లేశా!

బ్రతుకులన్నియు వ్యర్థములు మా
కతుకులన్ని యమంగళమ్ములు
బ్రతుక భూభరమొక్కటే యా
శ్రితుడ మల్లేశా!

నీటిబుడగల వంటితనువుల
వాటముగ ముస్తాబుచేసియు
మాటిమాటికి నెగిరిపడ నిం
కేటికోయి శివా!

రేపోనేడో చచ్చి నారక
కూపమందున కుములు తనువుల
నాపనీదును నాదుతరమా
పాపహంత శివా!

చేరిబ్రోచెదవా? యిదేకడ
సారమా? చూపైనలేదా?
కోరినినుజేరితిని దిక్కిక
లేరు మల్లేశా!

పాడుకొందును నిన్ను పరిపరి
వేడుకొందును, బ్రోసిపుచ్చిన
వీడనిన్నిక మమ్ముదయతో
చూడు మల్లేశా!

భూములిమ్మని వేడలేదో
స్వామి ధనధాన్యముల కోరను
మామనంబుల నిలుము పాప వి
రామ మల్లేశా!

మాటయే మాణిక్యమా? నీ
మూటమునిగినదయ్యా? కృపనీ
పాటిముద్దును దీర్చు మాకిదె
కోటి మల్లేశా!

అంబమాపాలిటికి సుఖ నికు
రుంబ జగముల కాదిశక్తియు
సంబరముతో కాచు మా భ్రమ
రాంబ మల్లేశా!

పొగడె నాలుగు వేదములు నిను
పొగడె నిగమములున్, ముఖాముఖి
పొగడనేనిదిలెక్కయా యీ
జగతి మల్లేశా!

సకల దేవేంద్రాది మస్తక
నికరమకుట విరాజిరత్న
ప్రకర భూషితపాద! జనపా
లకుడ మల్లేశా!

నిన్ను తెలిసికొనంగ పండితు
లెన్నోవిధముల తఱచి తెలియక
చిన్నబోయిరి యాదియంతము
నున్న మల్లేశా!

నీదుతత్వము నీదురూపము
నీదువాసము నీ కుయుక్తులు
నీదు చరితము నెరుగుజీవియె
లేదు మల్లేశా!

నీవెసత్యము నీవెయనృతము
నీవెసుఖదుఃఖములు రెండును
నీవె జీవిని జీవి నీవే
దేవ మల్లేశా!

కావముప్పది మూడు కోటుల
జీవరాసులకెల్ల సద్గతి
నీవగా కన్యంబుగలదా?
దేవ మల్లేశా!

తావ కేచ్ఛా మాత్రజన్యము
తావ కేచ్ఛా మాత్రనశ్యము
దేవయీజగమంత, కావగ
రావ? మల్లేశా!

కేవలుడవయి లీలగానీ
భావచిత్రపు నాట్యమంతయు
నీవె యాజ్ఞాపింప నాడును
జీవి మల్లేశా!

అందముగ నీసంస్మరణ ము
న్ముందు చేతునొ? చేయజాలనొ?
వందనములివె నిర్వికల్పా
నంద మల్లేశా!

సెలవు కరుణాసాగరా! యిక
సెలవునిమ్ము త్వదీయ పద సే
వలను దీర్చితి వేడికొంటిని
సెలవు మల్లేశా!

హనుమ త్రింశతి

హనుమ త్రింశతి

కాంచనపర్వతోపమనికామ మహోజ్వల దివ్య విగ్రహో
దంచితుఁబారిజాత తరుహారి సుమూల నివాసు భాసురా
భ్యంచిత దీప్తనేత్రుఁబరమాద్భుత సుందరపుణ్యదర్శనున్
పంచముఖాంజనేయుని సువర్చల భర్తఁ దలంతునెమ్మదిన్.

హరిహరధాతృరూపుని ననంత మహామహిమాభిరామునిన్
పరగత సర్వదుఃఖభయభంజనదక్షు ద్రిలోక రక్షకున్
పరమదయామయున్ బతితపావను శ్రీరఘురాముదూత భా
స్కరతనయానురక్తుని హసన్ముఖుఁ గొల్చెద వాయునందనున్.

అనుపమశంకరాంశుని సమస్తసురార్చిత పాదపంకజున్
గనదురు సత్ప్రతాప సపరిఖండిత కౌణపముఖ్యసింహతిన్
ప్రణత సువర్చలాంకిత శుభప్రద భవ్యతరోరుమూలునిన్
వినతసమస్త ఖేచసుబృందు నుతింతును వాయునందనున్

లంకాదాహక! నీవు నాభయములెల్లంగాల్చిపోకార్చి ని
శ్శంకన్ ధర్మమునందె నామనసు నిచ్చల్ నిల్పి దుర్భావనా
తంకంబుల్ పరిమార్చి యింద్రియతతిన్ త్రయ్యంత ధర్మాళిలో
నింకంజేయుము భక్తపాపహర సర్వేశాంశ తస్సంభవా!

మానవతానుభావ్యము లమందమహోఘము లట్టిపాపసం
తాన తిరస్కృతిందొలఁచి ధార్మిక భాస్కరతేజమిచ్చి యీ
మానవతాప్రపంచమది మాదెస మ్రొగ్గగఁజేయుమయ్య పం
చానన కోటిసంగతబలా! గృహిణీకృత తత్సువర్చలా!

కోరను విత్తరాశి నిఁకఁగోర మహేంద్రపదంబునేని నే
కోరను యక్షరాట్పదవిఁగోర బుభుక్షను దేవజన్మమున్
గోరను గాని నే నొకడెకోరుదు నీదు కృపార్ద్రదృష్టి నో
శూరశిఖామణీ దయఁ ద్రిశుద్ధిగదాని ననుగ్రహింపవే!

బలితపుప్రార్భవాఘతతిఁ బాపి గ్రహార్తిని బాఱఁద్రోలియి
య్యిలజనులన్ గ్రహించు నపమృత్యుభయంబుననణంచి యాసువ
ర్చల నవయౌవనామృతముఁజాలఁగగ్రోలెడి యర్కబంధు! నా
తలఁపుననుండి యెల్లపుడు ధార్మికవృత్తి ననుగ్రహింపవే!

పీడలనీతిబాధలను పెంపఱఁజేయుచుఁ గూర్చి భద్రముల్
గాడపునెవ్వగల్ తొలఁచి కష్టములన్ దురితాళిఁదోలి నీ
నీడనుజేరియున్న ననునేర్పున మన్చు శివావతార! నీ
వాఁడ విపన్నుఁడన్ అవనభారము నీపయినుంచు భక్తుఁడన్

ఓయి కపీంద్ర! యింద్రనుత! ఓయి క్షితీంద్ర! మహాతపస్సులన్
ధ్యేయమునీపదప్రణతి, దివ్యగజేంద్ర బలాఢ్య! పెంచుమా
స్వీయుల దాసవర్యుల వివేక సమృద్ధులనిచ్చి నిత్యమున్
పాయక, ఓజపాకుసుమ భాస్వరదేహ! సమీరనందనా

ఆకసమిందు సూర్యులుననగ్నియు రిక్కలు నీరు నీవయా
నాకవిభుండు శంకరుఁడు నబ్జజు డల్ల రమేశుఁడీవయా
లోకపతుల్ దిగీశులు మరుత్తులు శైలము లీవ, నాహృదిన్
శ్రీకరమూర్తినిల్చిన పరేశుఁడ వీవ కపీశ! రక్షమాం

లోకములన్ సృజించెదవు లోకులకెల్లను బుష్టిఁగూర్తు వా
లోకులసంహరించెదవు లోకములెల్లఁద్వదీయమూర్తులే
నీకుఁబ్రభుండు లేఁడు కపినేత! ప్రభుండవు సర్వ సృష్టికిన్
భీకరపంచవక్త్ర! సురభీకృత సర్వవిదిగ్దిగంతరా!

ఆపదలన్దమస్సులకునర్కుడవీవ జనావనేచ్ఛయే
చూపఁగలాఁడ వెల్లపుడుసూ; పురుహూతుఁడు మ్రొక్కునీకు నీ
ప్రాపునుగోరుచుంద్రు మునివర్యులు కిల్బిష నిహంతవీవ నీ
చూపులనాపయింబరపు చొక్క, భజింతు సమీరనందనా!

ఘనపాపంబులొనర్చిదిక్కఱిన సంఘంబేని నీ పాదముల్
తనుకంగా నొకతూరి దానికధికోత్సాహంబుచేకూర్తువో
హనుమా! సర్వజనైక మోహన! భవిష్యద్బ్రహ్మ! దీనావనా!
నిను నాచిత్తమునందు నిత్యమును ధ్యానింతున్ సమీరాత్మజా!

బంగరు జన్నిదంబును శుభప్రదమౌంజియు చల్లడంబునున్
బింగలదృష్టియుం జెవుల నిద్దపుఁగుండలముల్ త్రిణేత్రముల్
వంగిన కుచ్చుతోఁకయును బాహుచతుష్టయముందలిర్పగా
జంగమ మేరువౌదువు నిజంబుగ పావని! లోకపావనా!

చలనములేని రక్తిని నిజంబగుభక్తిని నీపదాబ్జముల్
తలచుచు సేవలంజలుపు తత్పరభావము నాకు నిమ్మటం
చెలమిని నే దంలచునపుడిట్టె మదీయమనోవ్యథల్ రుజల్
తొలఁగినశించు నగ్నిపడు తూలముపోలికి వాయునందనా!

ఇది నా కిమ్మన, భక్తుఁడీతడఁడని యెన్నేఁగూర్చుచున్నావు బు
ద్ధ్యుదమౌ నాజని ధన్యమయ్యెను స్వయంభూదేవ! పంచాననా!
సదయుండౌచు జయాశిషంబిడు ప్రభావప్రఖ్యమూర్తీ! నినున్
మదిధ్యానింతు జపింతునెప్డు, పరమాత్మా! జోత వాతాత్మజా!

హరిహరముఖ్యదేవగణ హారి కిరీట నిబద్ధ విస్ఫుర
త్సురుచిర దివ్యరత్న పరిశోభిత పాదనఖ ప్రకాశ సుం
దర భవదీయపాద పరిణద్ధ రజఃకణపూతదాస శం
కరఁ కరవాలశూల పరిఘాయుధధారి! నమోస్తు వాయుజా!

కనులను మోడ్చి బాహుపరిఘల్ పయికెత్తి, ఘటించి తాళముల్
మనమున రామనామమె సులక్ష్యముగా భజనమ్మొనర్చుచున్
కనులను బాష్పముల్ దొరగఁగా నటనమ్మొనరించు నీదు రూ
పును దిలకింపగా మదిని పుట్టదె భక్తి యదెట్టి వారికిన్?

నినుధ్యానించియజించువారలును నీనిర్ణిద్రసేవావిధుల్
మననంబుల్ మదిఁజేయువారలును, నీమాన్యస్వరూపంబు నీ
తనువుందాల్తురు, స్వామి భైరవులు కాదా సాక్షియిద్దాని, కే
మనివర్ణింతును నీమహామహిమ సర్వాత్మా! నమోవాకముల్

కండలమెండుగ్రక్కదల కర్కశకాయము పింగళాక్షులు
ద్దండతరాతిభీకరవిదారణదక్ష మహోగ్రవాలమున్
పండినరోమరాజి, నిరవద్యపరాక్రమ మాంజనేయ నీ
దండితనంబుఁజాటెడిగదయ్య మహాత్మ! ప్రభంజనాత్మజా!

ఆరనికార్యదీక్షయు ననన్యపరోపకృతి ప్రశస్తియున్
ధీరత, వాక్పటుత్వము, సుధీగణసంస్తుత కర్మనిష్ఠయున్
పేరుప్రతిష్ఠలాయువు! గపిప్రవరా నినుబోలనిచ్చి మా
భైరవమూర్తిగారికి సభాపరిపూజ్యతనిమ్ము సర్వదా!

నిండుసభన్ సుఖాసనము నీకిడకుండుట కాంచి వాలము
ద్దండతఁబెంచి దాని సముదదీంచితపీఠముగాఁగఁజుట్టి వే
దండమురీతినెక్కి తలఁదన్నుదునన్నటు వానిముందు గూ
ర్చుండి దశాస్యుగర్వము నిరుక్తినణంచితి వాయునందనా!

నీకృతికిన్ బహూకృతిగ నిర్మలమౌక్తిక హారమీయఁరా
మాకృతి యొక్కమౌక్తికమునందుఁగనంబడదేయటంచు నే
కైక సుమౌక్తికమ్ముఁజిదుకంగను మోఁదితివంట లేదె నీ
కాక? జగమ్ము రామమయమై కనుపట్టెనె వాయునందనా?

త్రిజగన్మాతను సీతనొక్కత్రుటిలో శ్రీరాముసాన్నిధ్యమున్
బుజమందెక్కుమ చేర్తునంటివట సంపూర్ణాకృతింజూపి భూ
మిజ నమ్మించితివంట పావని! నిజమ్మే నీ మహాభక్తి శ
క్తిజయాంకమ్ములవట్టివే, కనుక నీకే చెల్లు నట్లాడఁగన్

ఇనుని గ్రసింప వజ్రినినుచేయగ మూర్ఛిలినప్డు తండ్రి ని
న్ననువుగదాఁచి దాగినపుడా సురసంఘములా శిషమ్ములన్
దనుపుచు వేఁడ నీ జనకుఁ, దానునుదారతచూపి మన్చెగా
క నిలజ! లేనిచోఁ బ్రళయమై జగమెల్లను నాఁడె ద్రుంగదే!

అడ్డుగఁదోఁకఁదీయుమనియాడినభీముని, నేనువృద్ధుఁడన్
దొడ్డబలంబు వాఁడ వటుత్రోసుకపొమ్మనఁద్రోసి ముందుకున్
బడ్డ నిజానుజున్గని సభాజన బంధుతదెల్పి తోడు పా
టెడ్డ మహానుభావుఁడ వహీన బలాఢ్యుఁడవీవ పావనీ!

రామునిలక్ష్మణున్ బుజములన్ ధరియించుచు వాయువేగివై
సామముమీఱ కీశవిభుసన్నిధి నిల్పియు, నగ్నిసాక్షిగా
నామహనీయులంగలిపి యక్కఱలెల్లను జక్కదీర్చి నీ
కోమలదూతభావమతిగుప్తముగా నెరవేర్పవే ప్రభూ!

కడలినిదాటుటా సురసగర్భమువెల్వడు టాజి మూర్ఛలో
బడిన సుమిత్రనందనుని ప్రాణము నిల్పుట లంకఁగాల్చుటల్
దుడుకని జంబుమాలినటు దుర్ధరునక్షుని నాజిగూల్చుటల్
పుడమిని నీవెనర్చిన యమోఘ మహత్కృతులో మరుత్సుతా!

అందఱమర్త్యులయ్యు, నమృతాంధసులైనను, వేల్పులెల్లరుం
జెందిరిమిత్తి,నీవొ చిరంజీవివి, పిల్చిన నోయటందు, వా
క్రందనలెల్ల విందువు, నిరాశ్రయదాసులనుద్ధరించి వా
రందరికోర్కులన్ సఫలమౌనటు చేయుము వాయునందనా!

మంగళమో మహనీయా!
మంగళమో గిళిత పూర్ణమార్తాండవిభూ
మంగళము భైరవార్చిత
మంగళమిదెగొనుము సకలమానవరక్షా!